

# తథాస్తు!

ఆడదానికి అందం ఉండవచ్చుగాక ! తెలివితేటలు సరే ! కాని, అంత అహంకారం మాత్రం తగదు !

విద్య వినయాన్నిస్తుందన్నారు కాని, అడ్డమైన వాళ్ళు విద్యావంతులైతే పరిస్థితులింత దారుణంగా ఉండకేం చేస్తాయి ? 'కనకపు సింహాసనం మీద శునకాన్ని కూర్చుండబెట్టడాన్ని గురించి ఊరికె సెలవిచ్చాడా ? మొల్ల సంగతి సరే, ముద్దుపళని, రంగాజమ్మ లాంటివాళ్ళని ఎంతమంది ఆదరించారు ? ఎంత చదివినా, ఏం వెలగబెట్టినా 'స్త్రీ వినాశకారి' అనే ఘోషిస్తున్నాయి ఇతిహాసాలు.

ఆ ప్రజ్ఞకు ఏం చూసుకొని అంత పొగరు ? అసలు 'ప్రజ్ఞ' అనేది పేరులోనే. ఈ కాలం పేర్లు చూస్తుంటేనే (వింటూంటేనే) చిరాకు పుడుతుంది. రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమ అంటూ దేవవేశ్యల పేర్లు దివ్యంగా తగిలించుకుంటున్నారు. నిండా పిరికి లక్షణాలున్నవానికి పవన్‌కుమార్ అని పేరు పెట్టినట్టుందీ వ్యవహారం.

ప్రజ్ఞలోని ప్రజ్ఞేమిటో ఇప్పటివరకూ అర్థం కాలేదు. మొహం నిండా నవ్వు, ఒంటినిండా నేవళం, తెలిసీతెలియని విషయాలు వాగడం - ఇదేగా ఆవిడగారి ప్రజ్ఞ. నా అనుభవమంత వయసు లేదు. ఆరిందాలా నాకే చెప్పాలని చూస్తుందీ ? చాచి లెంపకాయ కొట్టాలన్నంత కోపమొచ్చేసింది. సంస్కార వంతుడిని గాబట్టి ఆ పని చేయలేకపోయాను. ఏది అల్పప్రాణమో, ఏది మహా ప్రాణమో, దేని 'ఉచ్చారణ' ఎలా

ఉండాలో చెప్పజూస్తుంది. 'ఉచ్చారణ'కూడా తప్పట. 'కావాలంటే శబ్దార్థ చంద్రిక గాని శబ్దరత్నాకరంగానీ చూడండీ !' అంది పైగా. తాతకే దగ్గు నేర్పుతుందా ? నేను డిక్షనరీ చూడాల్సిన అవసరమేమిటి?

ఈ స్టూడెంట్ వెధవలకేం పోగాలం ? 'కొత్తొక వింత – పాతొక రోత' అన్నట్టు, అప్పుడే నేనెవరో ఎరగనట్టు పోజులు కొడుతున్నారు. నిన్నటివరకూ ద్వితీయశ్రేణి పండితుడు కూడా దిక్కులేని ఈ బడిలో అన్నీ నేనే అయి ప్రథమ భాష నేర్పించాను. ఇన్నాళ్ళ భయభక్తులు ఏమయ్యాయో. ఆ కుర్రది రాగానే బెల్లం చుట్టు ఈగల్లా దాని చుట్టే తిరుగుతున్నారు. వ్యతిరేకలింగాల్లో ఆకర్షణబలం సహజమేగా ! ఎవర్నెక్కడుంచాలో ఆ అర్భకురాలికేం తెలుసు ? అయినా ఆడపిల్లల స్కూలికి యాభై దాటిన తర్వాతగానీ మగపంతుళ్ళు పనికి రారన్నప్పుడు, మగపిల్లల బడికొచ్చే ఆడంగులకీ ఆ నియమం వర్తింపజేయాలి కదా !

ప్రతి విషయానికీ నా మీద ఆధారపడే ప్రధానోపాధ్యాయుడు కూడా ప్లేట్ ఫిరాయించేశాడు. ఆవిడ ముందు నన్నో అనామకుడ్ని చేశాడు. మన అవతారమే అలాంటిది మరి. ఈ బొట్టూ, పంచెకట్టూ చూస్తే బీసీ నాటి రాతి మనుషులు గుర్తుకొస్తారాయె. తలచుకుంటే ...... నా పరిస్థితి శ్రీనాథ సార్వభౌముని అవసానాన్ని గుర్తు చేసేలా ఉంది ఒకనాడు ఎంత వైభవం....!

ఖద్దరు పంచె, దిద్దిన తిలకం, ఒకచేత గ్రంథం, మరోచేత బెత్తం..... కదిలొస్తేనే గడగడలాడి పోయేవారు. ఇప్పుడు పదో తరగతిలో సైతం వ్రేలెడు వెధవలే. అప్పట్లో చిన్న తరగతుల్లో సైతం మీసాలు మొలిచిన దున్నపోతుల్లాంటి పిల్లలుండేవాళ్ళు. ఎంతటి కొమ్ములు తిరిగినవాడైనా మనల్ని చూస్తే చెడ్డీలు తడుపుకోవాల్సిందే. కంచుకంఠంతో నన్నయ్య, తిక్కన, పెద్దన, శ్రీనాథ, పోతన, తిమ్మన, పిల్లల మర్రి.....ఎవ్వరి పద్యమైనా సరే మార్మోగిపోయేది. సాటి ఉపాధ్యాయులు సైతం మళ్ళీ మళ్ళీ పాడించుకొని పరవశించేవారు. ఇప్పుడు పద్యం ఊసెత్తితేనే పళ్ళికిలిస్తున్నారు. శుంఠలు ! ఈ తరం బాగుపడే దెలాగో!?

'చిఱు, కఱు, నడు, నిడులలోని ఱ, డల కచ్చు పరంబైనపుడు ద్విరుక్తటకా రంబగు' నన్న సూరి చిన్న సూత్రాన్ని కంఠతః పట్టండిరా ! అని చెబితే, ఏడాది గాదు గదా నాలుగేండ్లు గడిచినా చెప్పలేకపోతున్నారు. ఈ కాలం పిల్లలని కొట్టొద్దు, తిట్టొద్దు, అసలేమీ చదవకపోయినా ఏమీ అనొద్దు. హాజరుంటే చాలు, అవతలి క్లాసులోకి నెట్టేయాలి. మా కాలంలో ఎన్ని శిక్షలనుభవించేము! తలచుకుంటే చాలు చెమటలు పోస్తాయి.

సరే, కాలంతోపాటు పరిస్థితులూ మారతాయని సరిపెట్టుకుంటూ వస్తున్నా సుమారు మూడు దశాబ్దాలుగా నా తలవెంట్రుకలన్ని అనుభవాల్ని చూశాను. ఇలాంటిది మాత్రం తారసపడలేదు.

అసలీ పిల్ల ఏం చెప్పి ? (ఏం చేసి) అబ్బాయిల్ని ఆకట్టుకుంటుందో తెలుసుకోవాలని ఉంది. ఆ ! ఏం చెబుతుంది ? ఇలాంటి వాళ్ళని చూసే 'చదివినను చదవకున్నను ముదితలు పండితులు గారె పుట్టువు చేతన్ !' అని ఉంటారు తలకు మాసినవారెవరో !

నాకు మాత్రం కంట్లో నలుసులా, పంటికింది రాయిలా తయారయ్యింది ఈ ప్ర...జ్ఞ ! ఈ అమ్మాయి కారణంగా వారం రోజుల్లోనే వృత్తి మీద ఆసక్తి తగ్గిపోనారంభించింది. ఇంకా నయం - "ఆవిడే బాగా చెబుతూందండీ ! మీరు పెద్దవారయిపోయారు, అనామకమైన ఆరూ, ఎనిమిదీ తరగతులు వెళ్ళదీయండి. మిగతా ముఖ్యమైన తరగతులు ఆవిడే చెబుతుం"దని సెలవిచ్చాడుగాదు మా తలకాయ - పంతులు (త.పం) అదే హెడ్‌మాస్టరు.

ఈ టెన్షన్ వల్లో, తిండీ - నిద్రా సరిగ్గా లేకపోవడం చేతనోగాని, నాకు జ్వరం పట్టుకున్నది, అసలే బీ.పీ., అందులో షుగరు, మంచానికతుక్కుపోయాను. నేను మంచం మీదున్నా మనసంతా స్కూలుచుట్టే తిరుగుతోంది సజీవ ప్రేతాత్మలా. 'నేను వెళ్ళకపోతే నా క్లాసులు కూడా ఆ నంగనాచికే కట్టబెడతారేమో !' ఈ ఆలోచనే నన్ను మందులు సరిగ్గా మింగేలా చేసింది.

పూర్తి శక్తి చేకూరకున్నా, డాక్టరు సలహాని పట్టించుకోకుండా ఓ రోజు ముందుగానే బడికి వెళ్ళాను. అలా వెళ్ళడంలో కొంచెం ఆలస్యమైంది. లేటుగా వెళ్ళడం అలవాటులేని నాకు, బలమైన కారణమున్నా, ఏదో ఇబ్బందిగా అనిపించింది త.పం (హెచ్. ఎమ్.) ఎప్పటిలాగే ఆత్మీయంగా పలకరించాడు. అంతకంటే నాకు ముఖ్యం నా తరగతి బోధన !

"ఏం చూస్తున్నారు మేష్టారూ !" నేను పదో తరగతి రిజిష్టరు కోసం వెతుకుతూండటాన్ని గమనించి అడిగాడు త.పం.

చెప్పాను.

"మీరు రారని.....ప్రజ్ఞని పంపించాను ఆ క్లాసుకి...." మాటలు కూడ గట్టుకుంటున్నట్టు చెప్పాడు

నా కాళ్ళ కింద భూమి కదిలినట్లైంది. ఏం మాట్లాడాలో తోచలేదు. అక్కడే కుర్చీలో కూలబడిపోయాను. పరిస్థితి గమనించిన అటెండర్ నరసింహ మంచినీళ్ళ గ్లాసందించాడు.

నీళ్లు తాగి, సులోచనాలు తీసి, కళ్ళు తుడుచుకున్నాను. మెల్లగా ఆఫీసులో నుండి బయటికొచ్చాను. చాలా అవమానంగా ఉంది.

'నిజంగానే నేను లేకపోవడం వల్ల రోజు కొక్కరిని నా క్లాసుకి పంపిస్తున్నారేమో ఈరోజు ఆ అమ్మాయి వెళ్ళింది గాబో'లని సరిపెట్టు కోలేక పోయాను.

ఒక్క క్షణం కర్తవ్యవిమూఢుణ్ణయ్యాను. తర్వాత ఓ నిర్ణయానికొచ్చి, గబగబా క్లాసువైపు అడుగులేశాను.

"ఇది చెప్పటం కష్టమేముందండీ ! అర్జునుడు తెల్లగా ఉంటాడు" అంటున్నాడు గోవిందు.

"ఆహా ! అలాగా ! అర్జునుడు తెల్లగా ఉంటాడని ఎవరు చెప్పారు ?" ఇది ప్రజ్ఞ కంఠం.

సినిమాలో చూస్తూ ఉంటాం గదండీ ! కృష్ణుడేమో నల్లగా ఉంటాడు, అర్జునుడు తెల్లగా ఉంటాడు – ముందు వెనకలుగా, కలగలుపుగా మూడు నాలుగు గొంతులు పలికాయి.

"అర్జునుడికి పదిపేర్లు ఉన్నాయని, అందులో కృష్ణుడు అనే పేరూ ఉందని మీరెవరైనా విన్నారా ?" మళ్ళీ ప్రజ్ఞ గొంతు. ఎందుకైనా మంచిదని అడుగు ముందుకు వేయకుండా గోడకు చేరగిలబడ్డాను.

"నేను విన్నానండీ ! పిడుగుపడినపుడు చదవాలని మా తాతగారు ఒక శ్లోకం చెపుతూ ఉంటారండీ ! అందులో అర్జునుడి దశనామాలున్నాయన్నారండి! వాటిలో కృష్ణుడు అని కూడా ఉందండి " ఇది సూరిగాడి గొంతు.

"అంటే దాని అర్థం అర్జునుడు నల్లగా ఉంటాడనే గదా ! మనకు సందేహం తీర్చేఘట్టం తిక్కనగారు రాసిన తెలుగు భారతంలో ఉంది. రాయబారానికి వెళ్ళేముందు కృష్ణుడు పాండవులు అయిదుగురి అభిప్రాయాలు తెలిసికొన్న తర్వాత ద్రౌపది అభిప్రాయమూ అడిగాడు. అప్పుడు ద్రౌపది చెప్పినట్లుగా తిక్కనగారు ఏడెనిమిది పద్యాలు రాశారు. అందులో ఒక పద్యం ఇది.

**"వరమున బుట్టితిన్, భరత**
**వంశము జొచ్చితి, నందు పాండు భూ**
**వరునకు కోడలైతి, జన**
**వంద్యుల బొందితి, నీతి విక్రమ**

స్థిరులగు పుత్రులన్ బడసి
తిన్, సహజన్ముల ప్రాపుగాంచితిన్
సరసిజనాభ ! ఇన్నిట ప్ర
శస్తికి నెక్కినదాన నెంతయున్

"చూశారా తన పుట్టుపూర్వోత్తరాలు చెప్పి ఎటువంటి గౌరవమర్యాదలు కలిగిన కుటుంబంలో మెట్టి, ఎటువంటి కొడుకులను గన్నదీ ఈవిధంగా ముందుగా చెప్పి, ఆ తర్వాత రాజసూయ యాగం ద్వారా పొందిన గౌరవాన్ని కూడా తర్వాత పద్యాలలో చెప్తుంది.

"ఆ తర్వాత చెప్పిన ఈ పద్యమూ వినండి !

"ఈ వెంట్రుకలు పట్టి ఈడ్చిన యా చేయి...."

ప్రజ్ఞ పద్యం రాగయుక్తంగా చదువుతోంది. గొంతులో ఎంత మార్దవం ఉందో అంత గాంభీర్యం ఉంది. తన కష్టాలు తలపుకు రావడంతో ఎంత ఆవేశం తన్నుకు వచ్చినా - తాను మాట్లాడుతోంది కృష్ణునితోగదా, ఆ ఆవేశాన్ని అణచిపెట్టుకొన్న అణకువ ధ్వనిస్తోంది. అలాగని దీనత్వమూ లేదు, తాను వీర పత్ని, వీరమాత అనే అభిమానం ఉంది. ఇన్ని భావాలను కలబోసిన గొంతుతో, మొదటిసారిగా వింటున్నవాళ్ళకు కూడా అర్థమయ్యేలా చదువుతోంది - కాదు పాడుతోంది.

సీస పద్యం నాలుగుపాదాలూ అయిపోయాయి. గీతపద్యం ప్రారంభించి మొదటిపాదం పూర్తి చేయకుండానే ఆపేసింది. "కర్రి విక్రమంబు కాల్పనే" వింటున్నారు గదా ! నా కష్టాలు తీర్చలేని ఈ నల్లని వాని పరాక్రమం ఎందుకు? తగలెయ్యనా ? అని నిలదీస్తోంది ద్రౌపది. మరి ఆ నల్లనివాడు ఎవరు ? కృష్ణుడు కాదు, కృష్ణుని మీద ఆమె కేమి అధికారం ఉంది గనుక మాటలనడానికి. ఆ నల్లనివాడు మత్స్యయంత్రాన్ని కొట్టి తనను గెల్చుకొనిన నల్లనివాడే - అర్జునుడే"

వాక్ప్రవాహం ఆగింది, పిల్లలు కొందరు ఉత్సాహంగా చప్పట్లు కొడ్తున్నారు. కొందరు బాగా పాడారు టీచర్ అని, బాగా చెప్పారు టీచర్ అనీ అంటున్నారు.

"అగండి ! నా సందేహం పూర్తిగా తీరలేదు. అర్జునుడు అంటే తెల్లని వాడు అని నిఘంటువులో ఉంది. అర్జునుడు కర్రి, నల్లనివాడైతే ఇదెలా కుదురుతుంది ?" ప్రజ్ఞ నుండి మళ్ళీ ఇంకో ప్రశ్న. కొద్దిసేపు నిశ్శబ్దం. మీరే చెప్పండి టీచర్ - ఇద్దరు ముగ్గురు కూడబలుక్కొని అడిగినట్లున్నారు. ఇంతలో గంట మోగింది. పీరియడ్ అయిపోయిందని సూచనగా.

"మన కవులు కీర్తిని హంసతోనూ, అపకీర్తిని కాకితోనూ పోల్చటం విన్నారు

గదా ! అర్జునుడు తెల్లనైన అర్జున పుష్పం వలె విమలమైన తెల్లని కీర్తిగలవాడు. ఇపుడీ విషయం తెలిసినట్లేనా ? కేవలం పరీక్షల కోసమే చదివితే ఏమీ తెలుసుకోలేరు. తెలుసుకోడానికి చదవండి ! పరీక్షలు అవలీలగా పాసవుతారు."

"రేపు కూడా మీరే రావాలి టీచర్. తెలుగుసార్ చెప్పేది అర్థం కావటంలేదు ! అంతా సుత్తి. మేము హెడ్‌మాస్టర్‌గార్ని అడుగుతాం" గొంతుల సంఖ్య ఎక్కువగానే ఉంది.

"షటప్ ! అలా మాట్లాడొద్దు. ఆయన పాండిత్యంలో ఆవగింజంతయినా లేనిదాన్ని. ఆయన ముందు నేనెంత ? మా అన్నయ్య వాళ్ళంతా ఆయన దగ్గరే చదువుకున్నారు. వాళ్ళు చెప్పడం వల్లనే నాకు తెలుగుపట్ల అభిమానమేర్పడింది. ఏదో కొంత అబ్బింది. కొంచెం గొంతు బాగుంటే సరిపోయిందా ? ఆయన పాండిత్యానికి సాటి రాగలవారు ఈ చుట్టుపక్కల ఎవరూ లేరు. ప్రతి మనిషిలోనూ ఎక్కడో ఏదో లోపం ఉంటుంది. ఆయన క్రమశిక్షణ మీ లోపాలను క్షమించదు. ఆబాధతో ఆయన కొంచెం ఎక్కువగా మాట్లాడతారు. అంత మాత్రాన ఆయన ప్రతిభను శంకించడం సరికాదు. అంతటి పండితుని వద్ద విద్య నేర్చుకోవడం మీ అదృష్టం ! ఇంకెప్పుడైనా ఆయన్ని తక్కువ చేసి మాట్లాడితే సహించేది లేదు. ! మైండిట్ !" అలా నిప్పులు చెరిగిందీ అంతకుముందు అమృతమొలికిన కంఠం ఒక్కటేనా ? అన్న అనుమానం కల్గించింది ప్రజ్ఞ గొంతు.

నా కళ్లు చిప్పిల్లాయి.

నెమ్మదిగా అక్కడి నుండి కదిలాను. 'కరడుగట్టిన పాత భావాలను విడనాడి, పరిస్థితులకనుగుణంగా తనను తాను తీర్చిదిద్దుకోగలవాడే ఉత్తమ ఉపాధ్యాయు'డన్న డా. సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారి మాటలు గుర్తొచ్చాయి. తెలుగూ, తెలుగు పద్యం పదికాలాల పాటు పచ్చగా ఉండాలంటే ఇలాంటి ప్రజ్ఞల అవసరం ఎంతైనా ఉంది. వీళ్ళే వాగ్దేవి పదమంజీరాల మంజుల నిస్వనాలు.....

"నమస్తే మాష్టారూ ! ఆరోగ్యం బావుందా ?" అభిమానంగా అడుగుతున్న ప్రజ్ఞను చూస్తుంటే నా కన్నబిడ్డను చూసినంత ఆనందంగా ఉంది.

"ఆ !" అన్నాను యాదృచ్ఛికంగా చేయెత్తి ఆశీర్వదిస్తూ.

"నువ్వు ఇందాక చదివిన పద్యాలు ఇప్పటి పుస్తకాల్లో లేవు గదా ! ఎక్కడ చదివావమ్మా అని అడిగాను. "నేను అయిదులో ఉండగా మా పెద్దన్నయ్య ఇక్కడే మీ దగ్గరే పదో తరగతి చదివాడండి. మీరిలా పాడుతున్నారని ఇంటికొచ్చి అదే పనిగా పాడుతూ ఉండేవాడండి. విని, విని, నాకు నోటికొచ్చేసిందండి."

"అంటే నీవు....." సగంలో ఆగిపోయాను.

"కృష్ణమూర్తి చెల్లెలినండి మీరు బాలకవి అని వ్యవహరించే వారట" అంది మరోసారి నమస్కరిస్తూ.

"అలాగా ! చాలా సంతోషమమ్మా !"

'నాకంటె గొప్ప పేరు ప్రతిష్ఠలార్జించి, వృత్తి గౌరవాన్ని ఇనుమడింప జేసే ప్రజ్ఞ నీలో పుష్కళంగా ఉంది తల్లీ ! నీవు ఎనలేని కీర్తిని సంపాదిస్తావు !" మనసారా కోరుతూ తల నిమిరాను.

"తథాస్తు !" అనే ఉంటారు దేవతలు కూడా.

**(25 ఆగస్టు 2003, జాగృతి వార పత్రిక)**